క్లుప్తంగా

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



మాట్లాడుతున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య

యాచారం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు గొప్ప లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న శంషాబాద్ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాచారం ఎస్ఐ వెంకటనారాయణ, వైద్యాధికారిణి యశోదలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి ఎంతో ఉన్నతమైందన్నారు. ఇప్పుడు జీవితం గాడితప్పితే భవిష్యత్‌లో దిద్దుకోలేని నష్టం జరిగిపోతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం కంబాలపల్లి కల్పన–జగన్ దంపతుల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణస్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, బీచ్యానాయక్, పరమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, రాజుగౌడ్, జగన్‌గౌడ్, కేశవులు, కృష్ణ, పర్వతాలు, సుధీర్‌రెడ్డి, రామకృష్ణ, మురళీ, జగన్‌నాయక్, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందని లాగిన్ | ఫైళ్లు పెండింగ్!

- వివరాల సేకరణకే పరిమితమవుతున్న 'ధరణి స్పెషల్‌డ్రైవ్'
- సమస్యల పరిష్కారానికి అందని అనుమతి
- మేమేం చేయాలంటున్న రెవెన్యూ అధికారులు



ధరణి కమిటీ సభ్యులు ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్‌లకు ఫిర్యాదులు చేస్తున్న రైతులు

యాచారం: ధరణి స్పెషల్‌డ్రైవ్‌పై రెవెన్యూ అధికారుల్లోనే అయోమయం నెలకొంది. భూ దరఖాస్తులు పరిష్కరించడానికి సర్కార్ లాగిన్ ఇవ్వలేదు.. సమస్యలు ఎలా పరిష్కరించేదంటూ రెవెన్యూ అధికారులు పెదవి విరుస్తున్నారు. ధరణి కమిటీ సూచన మేరకు ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం సర్కార్ స్పెషల్‌డ్రైవ్ చేపట్టింది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో మ్యుటేషన్లు, పట్టామార్పిడి, రైతుల పేర్ల మార్పు, కోర్టు కేసులు, సెమీ అర్బన్, టీఎం–33 తదితర సమస్యల పరిష్కారం కోసం 2,550 పెండింగ్ భూ సమస్యలను గుర్తించారు. రెండు, మూడేళ్లుగా ఆయా గ్రామాల రైతులు మీ సేవల్లో దరఖాస్తులు చేసుకున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పాటైన తర్వాత ధరణి పోర్టల్‌పై ప్రత్యేక కమిటీని నియమించడం, కమిటీ పలుమార్లు సమావేశమై ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సర్కార్‌కు నివేదిక అందజేసింది. ఆ నివేదిక ఆధారంగా ప్రాధాన్యత కింద ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను స్పెషల్‌డ్రైవ్ ద్వారా పరిష్కరించేందుకు సడలింపు ఇచ్చిన విషయం తెలిసిందే. పేరుకే స్పెషల్‌డ్రైవ్ కానీ నేటికీ ఒక్క భూ సమస్య దరఖాస్తు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. భూ సమస్యలు పరిష్కరించే అధికారులకు సర్కార్ నుంచి ఎలాంటి ఆదేశాలు(లాగిన్) రాకపోవడంతో స్పెషల్‌డ్రైవ్ పేరుతో ధరణి పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను తీసుకొని రైతుల నుంచి వివరాలు తెలుసుకొని, తమ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పాత పహాణీ, ఎన్‌బీ, ఆన్‌లైన్ పహాణీలను పరిశీలించి ఫైల్లను సిద్ధం చేసి ఉంచుతున్నారు.

అధికంగా టీఎం–33 దరఖాస్తులే..

యాచారం మండలంలో అత్యధికంగా టీఎం–33 ధరణి దరఖాస్తులే ఉన్నాయి. అత్యధికంగా చింతపట్లలో 105, గునుగల్‌లో–118, కుర్మిద్దలో 119, మొండిగౌరెల్లిలో 150, నల్లవెల్లిలో 118, నందివనపర్తిలో 185, చింతుల్లలో 143, యాచారంలో 152, ఇలా 24 గ్రామాల్లో టీఎం–33 పెండింగ్ దరఖాస్తులే 1,557 ఉన్నాయి. టీఎం–33 కింద అన్ని రకాల నోషనల్ ఖాతాలను పట్టా భూములుగా మార్చడం, పేరు మార్పిడి, మిస్సింగ్ సర్వే నంబర్లు, డివిజన్లు, భూసేకరణ తప్పులు, విస్తీర్ణం సరి చేయడం, నాలా నుంచి వ్యవసాయ భూమిగా మార్పిడి తదితర భూ సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. యాచారం మండలంలోని మొత్తం ధరణి పెండింగ్ దరఖాస్తులు 2,550 ఉంటే అందులో టీఎం–33 పెండింగ్ దరఖాస్తులే 1,557 ఉన్నాయి. టీఎం–33 ఫైల్లు పరిష్కారం కావాలంటే సీసీఎల్‌ఏ పరిధిలో ఉంటుంది. తహసీల్దార్ టీఎం–33 పెండింగ్ దరఖాస్తుల వివరాల సేకరించి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏకు పంపిన ఎప్పటిలోగా దరఖాస్తులు పరిష్కరమవుతామోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. 2,550 ఉన్న మొత్తం దరఖాస్తుల్లో యాచారం రెవెన్యూ అధికారులు స్పెషల్‌డ్రైవ్‌లో దాదాపు 700 దరఖాస్తుల లోపే వివరాలు సేకరించి లాగిన్ వచ్చిన వెంటనే తమ స్థాయిలో పరిష్కరించి, మిగితావి ఉన్నతాధికారులకు పంపే విధంగా సిద్ధం చేసి పెట్టుకున్నారు. వారం రోజుల కింద యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ధరణి కమిటీ సభ్యులైన ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్లకు ధరణి దరఖాస్తులు పరిష్కరించమంటే తమకు లాగిన్ ఇవ్వలేదు, మేమేట్లా పరిష్కరించేదని రెవెన్యూ అధికారులు అంటున్నారని రైతులు ఫిర్యాదులు చేశారు.

వివరాలు సేకరించి పెట్టుకుంటున్నాం



యాచారం మండలంలోని ధరణి దరఖాస్తులు 2,550 పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు అయితే మాకు లాగిన్ ఇవ్వలేదు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు సేకరించి సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం. నిత్యం సిద్ధం చేసిన ఫైళ్ల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నాం. అత్యధికంగా టీఎం–33 ఫైళ్లు 1,557 ఉన్నాయి. లాగిన్ ఆదేశాలు వస్తే మా పరిధిలో ఉన్న అన్ని భూ సమస్యలు పరిష్కరించి, మిగితావి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

ధరణిలో సమస్యలపై దరఖాస్తులు

మంచాల: గత కొన్ని సంవత్సరాలుగా ధరణిలో నెలకొన్న సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు దరఖాస్తుల స్వీకరణతో కొంత ఉపసమనం లభించింది. మొత్తం పెండింగ్‌లో ఉన్న సమస్యలపై 2291 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో మోటేషన్ 35, ఆర్గనైజేషన్(సంస్థల)పేరుతో మ్యుటేషన్లు 09, గ్రీవెన్స్‌ల్యాండ్ 178, సేమీఅర్బన్ పీపీబీ 34, ఎగ్జిటీవ్ జీపీఏ 17, సక్సెషన్ విత్ అవుట్ పీపీబీ 32, పీపీబీ కోర్టు కేసు 09, నాల విత్ అవుట్ పీపీబీ 04, కోర్టు కేసు ఇంటిమేషన్ 337, ప్రోబిటేడ్ కేసులు 136, టీఎం–33కి సంబంధించి (సర్వే నంబర్లు మిస్సింగ్ తదితర) 1500 ఇలా 2291 దరఖాస్తులు వచ్చాయి. చాలా వరకు పరిష్కారం చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలంలో మొత్తం 2,111 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఈ వారం రోజుల్లో 274 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించినట్లు తహసీల్దార్ రవీందర్ దత్ తెలిపారు. మిగిలిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, వాటిని కూడా దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

'ప్రజాపాలనకు మద్దతుగా నిలవాలి'



మాట్లాడుతున్న ఆసీఫ్‌అలీ

కడ్తాల్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించడం హర్షణీయమని, ప్రజాపాలనకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మన్నె జీవన్‌రెడ్డి ప్రతిభావంతమైన నాయకుడని, ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని పరితపించే నాయకుడన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో స్థానిక సంస్థలకు నిధులు రాక, ప్రజాప్రతినిధులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనలో స్థానిక సంస్థలకు ప్రభుత్వం పెద్దపీట వేయనుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 4 గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానం నుంచి పోటీ చేస్తున్న మన్నె జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కోరారు. అదే విధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో 10వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆరుట్ల ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాపిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మంచాల: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వేదిరె పాపిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆరుట్ల గ్రామ చౌరస్తాలో నిర్వహించిన వేదిరె పాపిరెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తయారు చేయడానికి పాపిరెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. అనంతరం వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకరి పాండరినాథ్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్, కావలి బుగ్గరాములు, కృష్ణ, సుధాకర్, చంద్రయ్య, మోహన్‌నాయక్, జంగయ్య గౌడ్, రాజు, సురేశ్, లక్ష్మణ్, భాషా, రమేశ్, రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, ఎడ్మా నరేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందిస్తున్న సత్యం

ఆమనగల్లు: మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహ ఏర్పాటుకు ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యంలు రూ.10వేలు విరాళం అందించారు. కడ్తాల మండలం చరికొండకు చెందిన పూలే విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు, యువక్రాంతి యువజన సంఘం సభ్యులు శనివారం శెట్టిపల్లిలో గోదాదేవి సత్యంలను కలిసి పూలే విగ్రహ ఏర్పాటుకు విరాళం అందించాలని కోరారు. దీనికి స్పందించిన ఎగిరిశెట్టి సత్యం వెంటనే రూ.10వేలు విరాళం అందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కార్యదర్శి జగన్, అధ్యక్షుడు అంజయ్యలు

యాచారం: జిల్లాలోని పలు మండలాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు రెండు నెలలుగా బకాయిలు అందడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు సక్రమంగా వేతనాలు అందడం లేదని, ఎండలకు పనులు ముందుకు సాగడం లేదని ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని పీఎం నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వాహకంతోనే ఉపాధి హామీ పథకానికి పెద్ద గండం వచ్చిపడిందని అన్నారు. రోజుకు రూ.800వేతనం చెల్లించాలని, ప్రతి ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య తదితరులు ఉన్నారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో గల మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం కడవ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. అశేషంగా తరలి వచ్చే భక్తులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆలయంలో పూజలు చేస్తున్న నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని మాజీ ఎంపీ, బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని సంగమేశ్వర దేవాలయం, నాగన్‌పల్లి వీరభద్రుడి ఆలయం, పోల్కంపల్లి, నెర్రపల్లి గ్రామాల్లో ఆలయాలను మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, నాయిని సత్యనారాయణ, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్థానికేతరులతో తీవ్ర అన్యాయం

సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యుడు రవి

యాచారం: అక్రమంగా బదిలీలపై వస్తున్న స్థానికేతర ఉపాధ్యాయులతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నిండిపోతుందని, భవిష్యత్‌లో స్థానిక ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందని సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యుడు బొడ్డు రవి ఆందోళన వ్యక్తం చేశారు. యాచారం మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జీవో 317 కమిటీ వేసిన నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో 610కి విరుద్ధంగా ఉమ్మడి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల లెక్కలు తేల్చాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానికేతరులతో జిల్లాలోని ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. త్వరలో సేవ్ రంగారెడ్డి పేరుతో సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన కాలనీవాసులు



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని 24వ వార్డు మైత్రీ మీడోస్, శ్రీరంగపురం కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మైత్రీ మీడోస్ కాలనీలో రోడ్డు, శ్రీరంగాపురం కాలనీలో డ్రైనేజీ, ఔట్‌లెట్, రోడ్డు సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



అన్నదాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ, తదితరులు

తలకొండపల్లి: అన్ని దానాలకెల్లా అన్నదానం మహా గొప్పదని సీఐ రవీంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని చెన్నారం సమీపంలో ఉన్న మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా కడవ బోనాల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఈ సందర్భంగా చుక్కాపూర్‌కు చెందిన జక్కు నారాయణ్‌రెడ్డి, శ్యామలమ్మ దంపతులు, వారి కుమారులు జగత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, కొండల్‌రెడ్డిలు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య సీఐ, ప్రభాకర్‌రెడ్డిలు అన్నదాన కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దైవ కార్యాలకు దానం చేస్తే తప్పకుండా పుణ్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు బలరాం నాయక్, శ్రీకాంత్, ఎంఆర్‌ఎఫ్ ఫోరూం రంగారెడ్డి, యాదయ్యగౌడ్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, సత్యంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ టికెట్ మల్లు రవికి ఇవ్వాలి

దీప్‌దాస్ మున్షీకి కాంగ్రెస్ నేతల వినతి



దీప్‌దాస్ మున్షికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ మాజీ ఎంపీ డా.మల్లురవికి ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ రవీందర్‌నాయక్, ఖాదర్‌ఖాద్రిలు కోరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీని కలిసి వారు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ప్రజలకు అందుబాటులో ఉండి పిలిస్తే పలికే మల్లుగా పేరు తెచ్చుకున్నారని వారు గుర్తుచేశారు.

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవికి ఎంపీ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లు రవిని నియమించాలని కోరుతూ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీకి గాంధీభవన్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మ్యాక శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలాల్లోని అన్ని శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ వేడుకలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కనుల పండువగా జరిపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. శనివారం నిర్వాహకులు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం



కడ్తాల్: భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



యాచారం: సిద్ధేశ్వరాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఆమనగల్లు: భక్త మార్కండేయ ఆలయంలో..

యాచారం: స్వయంభు దేవాలయాలతో నందివనపర్తి గ్రామం గొప్ప పుణ్యక్షేత్రంగా మారబోతుందని, గ్రామంలో ఉన్న ఆలయాల అభివృద్ధి విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం నందివనపర్తిలోని స్వయంభు శివాలయంలో శివలింగానికి అర్చన, అభిషేకం నిర్వహించారు. అర్చకులు కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు సిద్దేశ్వరాలయానికి రూ.15లక్షల నిధులతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. నందివనపర్తిలోని సిద్దేశ్వరాలయం, నందీశ్వరాలయం వద్ద శనివారం పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

కనుల పండువగా కడవ బోనాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం కడవ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు కడవ కార్యక్రమం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకం, యువత ఆటపాట, భజనాపరుల శివ సంకీర్తనలు పలువురిని అలరించాయి.



తలకొండపల్లి: బోనాల ఊరేగింపులో భక్తులు



తలకొండపల్లి: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



ఆమనగల్లు: రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు